## భవిష్యజ్జాతక కథలు




ఆపడానికేముంది. నీ దగ్గిర మామూలుగానే డబ్బుండదు ఇప్పటి లాగానే అప్పుడు. ఓరోజున గబగబా అప్పులన్నీ తీర్చి అవతల పారెయ్య

డమే గాక అప్పుల వాళ్ళందరి మొహాలు బద్దలయ్యేలా విసరికొట్టి వాళ్ళకి యెదురప్పులుకూడా యిచ్చి ఏడిపించేటంత ధనికుడివి కావాలన్న దురాశ కొద్దీ ఓ రోజు పొద్దున్నే మంచిమాట చేసుకొని చిన్న లక్షాధికారింటికి వెళ్ళి ఐదొందలు అప్పుతీసుకుని, పెద్ద కోటీశ్వరుడింటికి బయలుదేరు తావు. ఓ షిర్లాగారింట చేబదులు అడగాలని వెళ్తొంటావు. ఆ రోజున షిర్లాగారు కారు నచ్చక సరదాకి రిక్షామీద కొంచెం దూరం వెళ్తారు. రిక్షాకి కూలి ఐదొంద లివ్వడానికి చిల్లరలేక, లక్షరూపాయల నోటుకి చిల్లర దొరక్క "వాట్" అనుకుంటూ వుంటారు. ఛేంజి నా దగ్గరుందని అందాకా ఆ పక్కనే వున్న నువ్వు ఆ డబ్బులిచ్చి రిక్షాని పంపేస్తావు. ఆనక ఆయన నీ ఫ్రెండయిపోయి, ఎపుడేనా లక్షా కోటీ యిబ్బందయితే మొహమాట పడకు పుచ్చుకో అంటాడు. అంటూ ఓ కోటి యిస్తాడు. ఇంకోటిమ్మం టావు నువ్వు. గంటసేపట్లో అప్పు తీరుస్తానంటావు. ఆ రెండుకోట్లూ ఇలా ఆ గంటా పట్టుకునేసరికి వూళ్లో పలుకుబడి దారుణంగా పెరిగిపోయి పెద్ద—డబ్బు—గాడిలో పడిపోతావు. అపుడు ఖంగారులో షిర్లాగారే నీ దగ్గిర పదీ పరకా లక్షలు అప్పు తీసుకుంటాడు కూడా.

ఈ విధంగా ఆలోచింపుకుంటూనే వోపక్క అప్పులవాళ్ళకు అందకుండా, వాన చినుకులమధ్య నకులుడు గుర్రం తోలినట్లు నీ చేతిలో డబ్బు పట్టుకు వెళ్తూ వుంటాడు. అయితే నీ కల, పతాక సన్నివేశానికి వచ్చేసరికి, ఆ కలలో నీ చేత డబ్బును ఏ బిర్లావో ఆడిగాడసుకొని

అందించ బోయినట్టు పట్టుకుంటావు. అపుడు యెక్కడనించో అప్పారావు వచ్చి రెండొందలు చేబదులు తీసుకుని, నీదగ్గర డబ్బుందని గాలిలో వూదేవరకూ, అప్పులవాళ్ళు వడగళ్ళలా వచ్చిపడి ఉన్నది ఊడ్చుకు పోతారు.

ఓ సింహాద్రీ! ఇపుడు ఆ బుద్ధే ప్రదర్శించి దొరకబోయే అప్పును నమ్ముకుని నా పుట్టలో ప్రవేశించావు గాన తెలపడమైనది అని సుబ్బన్న ఊరుకున్నాడు.

సింహాద్రి తెల్లబోయి తేరుకుని సెహబాసు, ఔనుగాని సుబ్బన్నా నీ కెలా తెలుసు ఇవన్నీ, ఈ జన్మలూ పిరాయింపులూ కథా కమామీషూనూ? అన్నాడు.

నీవు నేర్పిన విద్యయే అన్నాడు సుబ్బన్న వినమ్రత ఉట్టిపడేలా.

నాగలక్ష్మికి ఈ వరస చూడగా ఒళ్ళు మండింది. బావుంది నీ వినయం నువ్వూ. ఆనక కథయ్యేటపుడు అంతా కలిసి ఫోటోగ్రాపు దిగుదురుగాని గాని, ముందర వాళ్ళని లేవగొట్టు అంది భర్తతో.

ఓ నడికారు చీమ, గొంతు సవరించుకుని కలుగజేసుకుంది. అయ్యా సుబ్బన్నగారూ అలా చెప్పుడు మాటలు వినరాదు చెడేరు.